ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 కర్ణాటక వార్తలు
గురువారం 1 ఫిబ్రవరి 2024



నేటి నుంచి రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం

బెంగళూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొవిడ్ అవధిలో మూతపడ్డ ఆనేకల్ ప్యాసింజర్ రిజర్వేషన్ సెంటర్‌ను ఫిబ్రవరి 1న తిరిగి ప్రారంభించనున్నారు. ఈ మేరకు నైరుతి రైల్వే బెంగళూరు డివిజన్ నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కేంద్రం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఆదివారం మినహా మిగిలిన అన్ని రోజులు పనిచేస్తుందని తెలిపింది. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరింది.


సమావేశంలో పాల్గొన్న సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

అధికారులు రాజ్యాంగబద్ధంగా ఉండాల్సిందే

- ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చూడాలి
- ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీలు అందాలి
- జిల్లా ఇన్‌చార్జ్ సెక్రటరీల సమీక్షలో సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంలో అధికారులు సెక్యులర్ భావాలకు, రాజ్యాంగ విధానాలకు బద్ధులై ఉండాల్సిందేనని జిల్లా ఇన్‌చార్జ్ సెక్రటరీలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య హెచ్చరించారు. విధానసౌధలో బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ సెక్రటరీల తొలి సమావేశం జరిగింది. వారిని ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ మీ అనుభవాలు జిల్లా యంత్రాంగానికి ఉపయోగపడాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా ఉండాలని, జిల్లా స్థాయిలో ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకునేలా మిమ్మల్ని నియమించామని తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తయ్యిందని, జిల్లా అధికారులు, జిల్లా పంచాయతీ సీఈఓలతో సమావేశాలు నిర్వహించి పలు పాలనా పరమైన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఇన్‌చార్జ్ సెక్రటరీలుగా బాధ్యతలు చేపట్టాక మీ పనితీరు మెరుగు కావాలని, ఆది జిల్లా ప్రజలకు సంక్షేమాలు, ప్రభుత్వ పథకాలు అందేలా ఉండాలని సూచించారు. గ్యారెంటీ పథకాలు ఇంకా అర్హులైన వారికి అందడం లేదని, పలు చోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు వస్తున్న ఆరోపణలపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరికైనా గ్యారెంటీలు అందడం లేదంటే అంగీకరించే ప్రశ్నే లేదన్నారు. ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీలు చేరాల్సిందేనని, సాంకేతిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ తహసీల్దార్, డీసీ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగడం సరికాదన్నారు. సమస్య ఏదైనా ఫిర్యాదు అందితే వెంటనే పరిష్కారం జరగాల్సిందేనని తేల్చి చెప్పారు. జనతా స్పందనలో సామాన్య సమస్యలను సైతం వివరించేందుకు సుదూరం నుంచి వస్తున్నారంటే అక్కడి అధికారులు పట్టించుకోవడం లేదనేది కారణం కాదా... అని ప్రశ్నించారు. ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు చేపట్టాక, ఎన్ని హాస్టళ్లు, పోలీస్ స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలను సందర్శించారనేది నివేదిక ఇవ్వాలన్నారు. ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, రెవెన్యూ పోలీసు శాఖలకు సంబంధించి ఫిర్యాదులు చేస్తారని, వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జిల్లా అధికారులకు, ఇన్‌చార్జ్‌లకు సెక్యులర్ భావాలపై చిత్తశుద్ధి ఉండాలని, రాజ్యాంగం పట్ల గౌరవం ముఖ్యమన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే అటువంటి అధికారులను కొనసాగించే ప్రసక్తే లేదన్నారు. మీ స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని, సాధ్యం కానప్పుడు చీఫ్ సెక్రటరీల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని, అది పలు పరిణామాలకు కారణమవుతుందన్నారు.


హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ సెక్రటరీలు


లోకాయుక్త అధికారుల దాడిలో పట్టుబడిన బంగారు, వెండి ఆభరణాలు

అవినీతి అధికారులపై లోకాయుక్త పంజా

- 10 మందిపై 40 ప్రాంతాల్లో మెరుపు దాడులు

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి అధికారులపై లోకాయుక్త మెరుపు దాడులు చేసింది. బుధవారం ఉదయం వివిధ జిల్లాల్లో పలు శాఖల అధికారుల నివాసాలు, కార్యాలయాలు, వారి సమీప బంధువుల నివాసాలపైనా దాడులు కొనసాగించింది. ఉదయం లోకాయుక్త దాడుల అంశం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. చామరాజనగర, మైసూరు, మండ్య, తుమకూరు, కొప్పళ, బళ్లారి, మంగళూరులో పది మంది అధికారుల నివాసాలు, ఇతరత్రా ప్రాంతాల్లో కలిపి 40 చోట్ల దాడులు చేశామని లోకాయుక్త ఐజీపీ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. మండ్యలో ప్రజా పనుల విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హర్ష కార్యాలయంతోపాటు బెంగళూరులోని విద్యారణ్యపుర నివాసం, మండ్య జిల్లాలోని బంధువుల ఇళ్లపైనా దాడులు జరిగాయి. కల్లహళ్లిలో అతడి మామ ఇంటిపైనా దాడి చేశారు. నాగమంగలలోని ఫాంహౌస్‌లో దాడి చేసి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. హాసన్‌లో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని పౌర ఆహార సరఫరాల అధికారి జగన్నాథ్ నివాసంపై దాడి చేశారు. అతడి సోదరుడు, రియల్టర్ కిరణ్ నివాసంపైనా ఎస్పీ మల్లిక్ నేతృత్వంలో దాడులు జరిగాయి. చిక్కమగళూరులో వాణిజ్యపన్నులశాఖ అధికారి నేత్రావతి నివాసంపై లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ అనిల్ రాథోడ్ నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. మైసూరు నగరంలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఇంజనీర్ యజ్ఞేంద్ర కార్యాలయం, జేపీ నగర్‌లోని నివాసం, విజయనగర్‌లోని అపార్ట్‌మెంట్, కేఆర్‌నగర్ తాలూకా నర్గలె గ్రామంలోని అతడి సోదరుడి ఇంటిపైనా దాడులు జరిగాయి. తుమకూరులో కేఆర్‌డీఎల్ ఇంజనీర్ హనుమంతరాయప్ప ఇంటిపై దాడి కొనసాగుతోంది. మంగళూరులోని విద్యుత్‌శాఖ ఇంజనీర్ శాంతకుమార్ నివాసంపైనా దాడి జరిగింది. బళ్లారిలో వీఎస్‌కే యూనివర్సిటీ పీజీ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవికి సంబంధించి కార్యాలయం, నెహ్రూ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లపై లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు నేతృత్వంలో దాడులు కొనసాగాయి. చామరాజనగరలో గ్రామీణ నీటి పారుదల విభాగం ఇంజనీర్ రవికుమార్ కార్యాలయం వారి బంధువుల నివాసాలపైనా దాడులు జరిగాయి. కొప్పళ జిల్లా గంగావతిలో అటవీశాఖ అధికారి రేణుకమ్మ నివాసం, ఫాంహౌస్‌తోపాటు కొప్పళ రోడ్డులోని పలు ప్రాంతాల్లో దాడులు కొనసాగాయి. కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వారి ఆస్తులకు సంబంధించి రికార్డులను అంచనా వేస్తున్నట్టు ఐజీపీ ప్రకటించారు.

ఢిల్లీలో మాజీ మంత్రుల మకాం

- లోక్‌సభ టిక్కెట్ల కోసం సుధాకర్, శ్రీరాములు ప్రయత్నం



బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో టిక్కెట్ల కోసం ప్రయత్నిస్తున్న నాయకులు ఢిల్లీలో మకాం వేస్తున్నారు. చిక్కబళ్లాపుర నుంచి పోటీ చేసేందుకు సిద్ధమైన మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కీలక నేతలతో భేటీ అయ్యారు. బళ్లారి నుంచి మాజీ మంత్రి శ్రీరాములు లోక్‌సభ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఢిల్లీలో ఉన్న శ్రీరాములు బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిశారు. మరో వారంలో ఇద్దరు అగ్రనేతలు బెంగళూరుకు వచ్చి అభ్యర్థుల ఎంపికపై కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈలోగానే ఢిల్లీనేతలను కలసి తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా కోరుతున్నారు. యడియూరప్ప, బసవరాజ్‌బొమ్మై కేబినెట్‌లో డాక్టర్ సుధాకర్, శ్రీరాములు మంత్రులుగా వ్యవహరించారు. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో ఇద్దరూ ఓడిపోయారు. మరో ఐదేళ్లు ఎలాంటి పదవులు లేకుండా ఉండలేమని భావించి లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. చిక్కబళ్లాపుర సిట్టింగ్ ఎంపీ బచ్చేగౌడ ఏడాదిన్నరకు పైగా బీజేపీతో సఖ్యతగా లేరు. పైగా గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో కుమారుడు శరత్ కాంగ్రెస్ తరపున పోటీ చేయగా మద్దతుగా నిలిచారు. ఎలాగూ టికెట్ లభించదని తెలిసి ఏకంగా వయసు పైబడిన కారణంగా పోటీ చేసేది లేదని ప్రకటించుకున్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఉన్నందున బచ్చేగౌడకు టికెట్ ఉండదని సమాచారం. శ్రీరాములకు బళ్లారి టికెట్ ఇచ్చే విషయమై అధిష్ఠానం పెద్దలే సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. పనిలోపనిగా శ్రీరాములు అగ్రనేతల వద్ద మాజీ మంత్రి గాలిజనార్దనరెడ్డిని పార్టీలోకి వచ్చే విషయం కూడా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. దీనిని బట్టి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఏక్షణంలోనైనా గాలి బీజేపీ గూటికి వచ్చే అవకాశం ఉంది.



గొర్రెల మందపైకి దూసుకొచ్చిన లారీ

- ఇద్దరు కాపలాదారులు, 20 గొర్రెలు మృతి

డీ.హీరేహాళ్, జనవరి 31: గొర్రెల మందపైకి లారీ దూసుకురావడంతో ఇద్దరు కాపరులు, 20 గొర్రెలు మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున జాజరకల్లు టోల్ ప్లాజా సమీపంలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం సండూరు తాలూకా లక్ష్మలపల్లి గ్రామానికి చెందిన కాపరులు మేత కోసం గొర్రెలను తీసుకుని అనంతపురం జిల్లా డీ.హీరేహాళ్ మండలం లోని నాగలాపుర గ్రామానికి వెళ్లడానికి రాత్రి సమయంలోనే బయలుదేరారు. బళ్లారి - బెంగళూరు హైవే జాజరకల్లు టోల్ ప్లాజా సమీపంలో రోడ్డును దాటుతుండగా బళ్లారి నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ గొర్రెల మంద పైకి దూసుకొచ్చింది. దీంతో ఆ గొర్రెల మందలో ఉన్న రుద్రప్ప(21), గోపాల్(18)పై కూడా లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రుద్రప్ప అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను బళ్లారి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ రంగడు యాదవ్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదంపై వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.


మృతి చెందిన గొర్రెలు

నవదంపతుల దారుణహత్య

- నిశ్చితార్థం తర్వాత వేరొకరితో పెళ్లి చేసుకుందని యువకుడి ఘాతుకం

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా అథణి తాలూకా కొకటనూరు గ్రామంలో మంగళవారం నవదంపతులను ఓ వ్యక్తి కొడవలితో దారుణంగా హత్య చేశాడు. కుమార్తె, అల్లుడిపై దాడి జరుగుతుండగా అడ్డువచ్చిన తల్లిదండ్రులను గాయపరిచాడు. ఈ దాడిలో యాసిన్ బ్యాగోడ(21), హీనాకౌసర్ (19) దారుణహత్యకు గురయ్యారు. దాడికి పాల్పడిన వ్యక్తి తౌఫిక్ క్యాడిగా నిర్ధారించిన పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు. యాసిన్, హీనాకౌసర్ ప్రేమించుకున్నారు. నాలుగునెలల కిందట హీనాకౌసర్‌తో తౌఫిక్ పెళ్లి జరిగేలా ఇరు కుటుంబాల పెద్దలు నిశ్చయించారు. నిశ్చితార్థం ప్రక్రియ పూర్తి చేశారు. కానీ హీనాకౌసర్, యాసిన్ బ్యాగోడతో కలిసి ఇంటి నుంచి పరారయింది. ఇరుకుటుంబాల మధ్య వాగ్వాదం జరిగింది. వారి ఆచూకీ తెలుసుకున్న ఇరు కుటుంబీకులు గ్రామానికి రప్పించి పెద్దల సమక్షంలో పెళ్లి చేశారు. నవదంపతులు కొకటనూరు గ్రామంలో నివసించేవారు. తనకు కాబోయే భార్య మరొకరిని పెళ్లి చేసుకుందని అప్పటి నుంచి ఆగ్రహంతో ఉన్న తౌఫిక్ మంగళవారం నేరుగా హీనాకౌసర్ ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఉండే హీనాకౌసర్, ఆమె భర్త యాసిన్‌లను కొడవలితో దారుణంగా హత్యచేశాడు. అంతలోనే అడ్డువచ్చిన హీనాకౌసర్ తల్లిదండ్రులు అమీనాబాయి, ముస్తఫాపైనా కూడా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. దారుణానికి పాల్పడిన తౌఫిక్ పరారీ అయ్యాడు. ఐగళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు.

బెంగళూరులో రెండు చోట్ల జెండాల తొలగింపు

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండ్య తాలూకా కెరగూడు గ్రామంలో హనుమంతుడి జెండా వివాదం తారస్థాయికి చేరిన నేపథ్యంలో బెంగళూరులో రెండు జెండాలను పోలీసులు తొలగించారు. శివాజీనగర్ చాందినిచౌక్ మధ్యలోని విద్యుత్ స్తంభానికి ఇస్లాం మతానికి చెందిన జెండా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఫొటోను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తూర్పు డీసీపీకి ట్యాగ్ చేశారు. ప్రత్యర్థి దేశానికి చెందిన రంగుతో ఉండే జెండా ఎగురుతుండడం గమనించలేదా... అంటూ రాసుకున్నారు. దీంతో పోలీసులు ఆ జెండాను మంగళవారం తొలగించారు. చామరాజపేట నియోజకవర్గ పరిధిలోని జేజే నగర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఓ స్తంభానికి అమర్చిన ఇస్లాం జెండా ఉండడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తూ శశాంక్ జేఎస్ అనే వ్యక్తి 'ఎక్స్'లో పోస్టు చేశారు. సీఎం, డీసీఎం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ఎమ్మెల్యే యత్నాళ్‌కు ట్యాగ్ చేశారు. ఈ మేరకు జేజే నగర్ పోలీసులు అక్కడి జెండాను బుధవారం తొలగించారు.


నిత్యం రద్దీగా ఉండే ఎస్సీ రోడ్డు ఇలా..

బెంగళూరు ఎస్పీ రోడ్డుకు అంతర్జాతీయ గుర్తింపు

బెంగళూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో ఎస్పీ రోడ్డుగా ఖ్యాతి గడించిన సదర్ పత్రప్ప రోడ్డుకు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గుర్తింపు లభించింది. మొబైల్, కంప్యూటర్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు హోల్‌సేల్ ధరకు లభించే ఎస్పీ రోడ్డును దేశ విదేశాల నుంచి సందర్శకులు వస్తుంటారు. అమెరికా ప్రతినిధుల సంస్థ యూఎస్‌టీఆర్ మంగళవారం విడుదల చేసిన ప్రపంచపు ప్రముఖ మార్కెట్‌ల వార్షిక జాబితాలో బెంగళూరు ఎస్పీ రోడ్డుకు చోటు దక్కడం విశేషం. 39 ఆన్‌లైన్ మార్కెట్‌లు, 33 భౌతిక మార్కెట్‌లు ఈ జాబితాలో ఉన్నాయి. రాష్ట్రం నుంచి ఒక్క ఎస్పీ రోడ్డుకు మాత్రమే చోటు లభించడం సంతోషంగా ఉందని కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య పేర్కొంది. బెంగళూరు నగరంలో ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్ స్ట్రీట్ కూడా విశేష ప్రజాదరణ కల్గిన ప్రాంతాలుగా ఉన్నాయి. అయితే వీటన్నింటిలోకల్లా భిన్నంగా ఎస్పీ రోడ్డును నిత్యం వేలాదిమంది సందర్శిస్తుంటారు. ఇక్కడ కంప్యూటర్లతోపాటు ఎలక్ట్రానిక్ విడి పరికరాలు లభిస్తుండడమే ఇందుకు కారణం.

వందకోట్ల మంది సేవలో మెట్రో

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మెట్రో ద్వారా 100 కోట్ల మంది ప్రయాణించడం ద్వారా మరో మైలురాయిని అధిగమించింది. నమ్మమెట్రో ప్రస్తుతం 73 కిలోమీటర్‌ల ద్వారా రెండుమార్గాలలో సేవలు అందిస్తోంది. మంగళ వారం రాత్రితో నమ్మ మెట్రో రైలు ద్వారా వందకోట్ల మంది ప్రయాణించడం సరి కొత్త రికార్డుగా బీఎంఆర్‌సీఎల్ ప్రకటించింది. 2011 అక్టోబరు 20న నమ్మమెట్రో రైలు సేవలు ఆరంభం అయ్యాయి. ఆ తర్వాత అంచెలంచెలుగా విస్తరించింది. ప్ర స్తుతం కెంగేరి నుంచి వైట్‌ఫీల్డ్ దాకాను, నాగవార నుంచి కనకపుర రోడ్డు మార్గాలలో మెట్రో సేవలు ఉన్నాయి. తెల్లవారు నుంచి రాత్రి దాకా సాధారణ ప్రయాణాలు అనిపించినా ఉదయం 8-11 గంటల మధ్యన సాయంత్రం 4-7గంటల వ్యవధిలో మెట్రో ప్రయాణమంటే నిలబడి తిరగాల్సిందే అనేలా సాగుతుంది. కెంగేరి నుంచి వైట్‌ఫీల్డ్ మార్గంలో ఐటీ ఉద్యోగులకు అనుకూలంగా ఉండటంతో ఈమార్గం దాదాపు అన్ని వేళలా బిజీగానే ఉంటోంది. 100కోట్ల మంది మెట్రోసేవలు సద్విని యోగం చేసుకోవడంపై బీఎంఆర్‌సీఎల్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజులలో మెట్రో సేవలు మరింత సులభతరం, సురక్షితం చేస్తామన్నారు.



హంపి ఉత్సవాలకు సిద్ధమవుతున్న వేదికలు


సిద్ధమవుతున్న గాయత్రి వేదిక


పూజల్లో కూర్చున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కంప్లి, జనవరి 31: ఫిబ్రవరి 2, 3న జరిగే ప్రసిద్ధి గాంచిన హంపి ఉత్సవాలకు వేదికలను సిద్ధం చేస్తున్నారు. గాయత్రి వేదిక, ఎదురు బసవన్న వేదిక, విరుపాక్షిస్వామి వేదికలకు ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. గత యేడాది కన్నా ఈసారి భారీగా నిర్వహించాలని భావిస్తున్నారు. హోస్పేట ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ కూడా 2న ముఖ్యమంత్రి వస్తున్న తరుణంలో ఊరేగింపు ప్రాంతాలను పరిశీలించారు. ఉత్సవాలను మూడు రోజుల పాటు కన్నుల పండువగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పనులను పర్యవేక్షిస్తున్నారు.


సిద్ధమవుతున్న ఎదురు బసవన్న వేదిక


తుంగభద్ర నదికి హారతి ఇస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో తుంగ హారతి

ప్రసిద్ధిగాంచిన హంపి తుంగ హారతి పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే గవియప్ప, జిల్లా అధికారులు ఎంఎస్ దివాకర్, ఎస్పీ హరిబాబు, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్ తదితరులు విరుపాక్షేశ్వరస్వామి, పార్వతి దేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపి ఉత్సవాలను పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే తుంగభద్ర హారతి నిర్వహిస్తారు. ఆ కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపడతారు. తుంగహారతి కార్యక్రమానికి పర్యాటకులు, భక్తులు, స్థానిక ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.39	1,616.44
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	442	8,463
సామర్థ్యం (టీఎంసీలు)	9.74	51.92

రాజ్యాంగ జాతాకు ఘనస్వాగతం



పూర్ణకుంభాలతో స్వాగతం పలుకుతున్న గ్రామప్రజలు

బళ్లారి సిటీ, జనవరి 31: రాజ్యాంగం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో పర్యటిస్తున్న రాజ్యాంగ అవగాహన జాతాకు బుధవారం తాలూకాలోని రూపనగుడి గ్రామంలో ఘన స్వాగతం లభించింది. రాజ్యాంగ అవగాహన జాతా గ్రామానికి చేరుకోగానే పూర్ణకుంభాలను పట్టుకుని మహిళలు డోల్లు కళాకారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, ఘన స్వాగతం పలికారు. జాతా కార్యక్రమంలో రూపనగుడి గ్రామపంచాయితీ అధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వం అన్ని గ్రామపంచాయితీల్లో రాజ్యాంగ చైతన్య జాతా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో చెళ్లగుర్కి గ్రామ నాయకుడు రామన్న, సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.మమత, ఆ శాఖ సిబ్బంది, గ్రామపంచాయితీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరబ్రహ్మ బెంద్రే జయంతి



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, జనవరి 31: అద్వైత సిద్ధాంతంలోని నేను, నా, తాను, నీవు అనే నాలుగు ఆధ్యాత్మిక పదాలతో కూడిన సరళమైన కావ్యాలను రచించిన మహాకవి దా.రా.బెంద్రే అక్షర బ్రహ్మగా ప్రసిద్ధి చెందారని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ వేదిక అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోటే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన డాక్టర్ బెంద్రే 128వ జయంతి కార్యక్రమంలో ఆయనపాల్గొని మాట్లాడారు. బెంద్రే అంబికాతనయదత్త అనే కవితా పేరుతో పద్యాలురాసి సామాన్యులకు పరిచయం అయ్యారు. ఆయన నాదలీలే, నాకుతంతి, అరలు ఇసుక, ఉయ్యాలే, సఖీగీత మొదలైన ప్రసిద్ధ కవితలు రచించారు. ఆయన రచించిన నరబలి కవిత బ్రిటీష్ పాలనను ప్రశ్నిస్తూ ఉండడంతో ఆయనను జైలులో పెట్టారు. రసమే జననం, విరసమే మరణం, సమరసమే జీవితం అన్న బెంద్రే మాటలు రచయితలకు స్ఫూర్తిదాయకంగా మారాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు సుమతి, శ్వేత, ఉమ్మెహాని, శాశమ్మ, రామాంజినేయ, విద్యార్థినులు హాలిగెమ్మ, నిత్య పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీ చార్జీలు తగ్గించాలి

బళ్లారి సిటీ, జనవరి 31: నగరంలోని కోల్డ్ స్టోరేజీలో మిర్చి బస్తాల రుసుము పెంపుదలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఏఐకేకేఎంఎస్ రైతుసంఘం బుధవారం ఉద్యానవన డైరెక్టర్ సంతోష్‌కు వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లాధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజీలో రైతులు పెట్టిన మిర్చి బస్తాలపై పెంచిన రుసుమును ఉపసంహరించుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి గురల్లిరాజా, బళ్లారి తాలూకా అధ్యక్షుడు ఈరన్న, తాలూకా కార్యదర్శి ధనరాజ్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు నాయకుడి మృతి

కంప్లి, జనవరి 31 : రాష్ట్ర రైతు సంఘం హసురు సేన ప్రధాన కార్యదర్శి జే కార్తీక్ (50)రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన హోస్పేట నుంచి బెంగళూరు-బొంబాయి హైవేలో బూదిగుంప క్రాస్ వద్ద వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో తలకు బలమైన గాయాలు తగిలాయి. హుబ్లీకి తరలించినా తలకు బలమైన గాయాలు కావడంతో ఆయన మృతి చెందారు. దీంతో రైతు సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా వారిగా, తాలుకా వారిగా నివాళులర్పించారు.

లారీ చక్రాల కింద రైతు కష్టం!

● ఏపీఎంసీలో డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు మాయం ● రోడ్లపైనే పంట ఉత్పత్తుల ఆరబోత

బళ్లారి గాంధీనగర్, జనవరి 31: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రావడం ఒక ఎత్తయితే.. చేతికందిన పంటను మార్కెట్‌లో అమ్ముకోవడం మరో ఎత్తు. సొంత భూములు ఉన్నవారి పరిస్థితి ఏమిటో గాని..కౌలు రైతుల కష్టాలు అన్నీఇన్నీ కావు. పంటపండిన చోట అరబెట్టడానికి కల్లాలు లేకపోవడంతో కోసిన పంటను అమ్మకానికి నేరుగా మార్కెట్‌కు తీసుకువస్తారు. తీసుకొచ్చిన పంట



లారీ చక్రాల క్రింద నలిగి పోతున్న మొక్కజొన్న పంట

ఉత్పత్తులను ఆరబెట్టడానికి సరైన డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు లేకపోవడంతో రోడ్లపైనే రోజుల తరబడి అరబెట్టుకుని మంచి రేటు వచ్చినపుడు అమ్ముకోవాల్సిన పరిస్థితి బళ్లారి ఏపీఎంసి మార్కెట్‌లో నెలకొంది. ప్రస్తుతం రికార్డుల ప్రకారం ఏపీఎంసీలో మొత్తం 11 డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. వీటిలో నాలుగు ప్లాట్‌ఫారాలను ఏపీఎంసి అధికారులు రాత్రికి రాత్రే మాయం చేసి కోల్డ్ స్టోరేజీకి కేటాయించారు. మూడింటిని రూఫ్ ప్లాట్ ఫారాలుగా మార్చి వ్యాపారులకు అనుకూలంగా తయారు చేశారు. ప్రధాన గేటు ప్రక్కన ఉన్న రెండు డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు మినహా... మరో రెండు ప్లాట్‌ఫారాలు పూర్తిగా శిథిలం కావడంతో రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటను రోడ్లపై అరబెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిదుటే తీసుకొచ్చిన పంట కొంత మట్టిలో కలిసి పోతుండగా, మరి కొంత లారీ చక్రాల క్రింద నలిగి పోతుంటే ఏంచేయాలో రైతు



శిథిలమైన డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు..

లకు పాలుపోవడంలేదు. చేసేదిలేక లారీల రాకపోకల కారణంగా చెల్లాచెదరైన పంటను రైతులు తిరిగి రాసిగా మార్చి కొనుగోలు చేసే వ్యాపారుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. బళ్లారి ఏపీఎంసి మార్కెట్‌లో స్థానిక వ్యాపారుల డిమాండ్ల పరిష్కారానికే అధికారులు మొగ్గు చూపుతున్నారేగాని మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తీసుకొచ్చిన రైతుల అవసరాలు తీర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనడానికి పైన కనిపిస్తున్న దృశ్యాలే అద్దం పడుతున్నాయి.

ముప్పై ఏళ్లుగా అతడికి
అడవి ఆకులే ఆలంబన



ఆకులను కట్టలుగా కడుతున్న శివప్ప

కంప్లి, జనవరి 31 : కంప్లికి చెందిన శివప్ప వాగులు, వంకలు దాటుకుని ప్రతినిత్యం అడవికి వెళతాడు. అక్కడ ఆకులు కోసుకొచ్చి టిఫిన్‌హోటళ్లకు అందిస్తాడు. తనను పలకరించిన విలేకరితో మాట్లాడుతూ, తన వయస్సు 75 సంవత్సరాలకు పైబడి ఉంటుందని అయినా తనకాళ్లపై తాను జీవించడంలోనే ఆనందం ఉన్నదని అంటున్నాడు. ప్రతినిత్యం నలభై కట్టల ఆకులు తీసుకొస్తానని కట్ట రూ. 10వంతున హోటళ్లకు విక్రయిస్తున్నానని తెలిపాడు. ఉదయాన్నే 4 గంటలకు లేచి సైకిల్‌పై వెళ్లి ఆకులను కోసుకుని ఎనిమిది గంటలకల్లా హోటళ్లకు అందిస్తానని తెలిపాడు. ముప్పై ఏళ్లుగా అలా వచ్చిన దాంట్లోనే తమ కుటుంబం జీవిస్తోందని తెలిపాడు.

స్టాంప్‌ల సేకరణ అలవర్చుకోవాలి

● పోస్టల్ శాఖ డైరెక్టర్ తార ● కుమారస్వామి ఆలయం, బసవరాజేశ్వరి పోస్టల్ కవర్ల విడుదల

బళ్లారి గాంధీనగర్, జనవరి 31: విద్యార్థులు చదువుతో పాటు పోస్టల్ శాఖకు చెందిన స్టాంప్స్ పోస్టల్ కవర్లను సేకరించే అలవాటు చేసుకోవాలని, దాని ద్వారా జ్ఞానాభివృద్ధికి సాధ్యమవుతుందని ఉత్తర కర్ణాటక విభాగం పోస్టల్ శాఖ డైరెక్టర్ వి.తార అభిప్రాయపడ్డారు. భారతీయ తపాలా శాఖ, బళ్లారి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం దివంగత మాజీ కేంద్ర మంత్రి బసవరాజేశ్వరి, సండూరు కుమారస్వామి దేవస్థానం భావచిత్రాలతో పోస్టల్ కవర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, దివంగత బసవరాజేశ్వరి హైదరాబాద్ విమోచన పోరాటంలో చాలా చురుకుగా పాల్గొన్నారన్నారు. దీంతో పాటు బళ్లారి లోక్‌సభ నియోజకవర్గానికి మూడు సార్లు ప్రాతినిధ్యం వహించిన బసవరాజేశ్వరి 1991, 1996 వరకు పి.వి. నరసింహరావ్ ప్రభుత్వంలో మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రిగా పనిచేశారన్నారు. సండూరు కుమారస్వామి దేవాలయం అత్యంత ప్రాచీన దేవాల యాల జాబితాలో చేరిందన్నారు. క్రీస్తు శకం 8 నుండి 10వ శతాబ్దానికి చెందిన ఈ దేవాలయం అప్పటి నుండి ఇప్పటి వరకు సాంస్కృతిక పరంపరతో కుమార స్వామి పూజలు అందుకోవడం విశేషం అన్నారు. బసవరాజేశ్వరి కుమారులు



పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న ఉత్తర కర్ణాటక పోస్టల్ శాఖ డైరెక్టర్ వి.తార

డాక్టర్ ఎస్.జె. మహిపాల్, డాక్టర్ యశ్వంత్ భూపాల్ రాజకీయ రంగంలో రాణించారన్నారు. సరళజీవనం సాగించడంతో అందరికి ఆదర్శప్రాయమైన బసవరాజేశ్వరి సేవలను గుర్తించి ఆమె భావచిత్రంతో పోస్టల్ కవర్ విడుదలచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అల్లాసాబ్, చిదానంద హగావి, షణ్ముగంలు కార్యక్రమాన్ని నిర్వహించగా, బిపిఎస్, బిఐటిఎం సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ బసవరాజేశ్వరి విద్యాసంస్థలు, కిష్కింద విశ్వవిద్యాలయ సిబ్బంది, బసవరాజేశ్వరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి



చలవాది సమాజ జిల్లా అధ్యక్షుడు హనుమంతును అభినందిస్తున్న దృశ్యం

కంప్లి, జనవరి 31 : చలవాది సమాజం అన్ని రంగాల్లో ముందడుగు వేయాలంటూ జిల్లా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు సీఆర్ హనుమంతు తెలిపారు. కంప్లి పట్టణంలో గురుభవన్‌లో చలవాది మహాసభ సమాజం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ వృత్తిపరంగా వస్తున్న పనులకే పరిమితం కాకుండా అభివృద్ధి రంగాలలో ముందడుగు వేసినప్పుడే తమకు గుర్తింపు వుంటుందని తెలిపారు. అనంతరం ఆయనకు చలవాది సమాజ ప్రముఖులు ఆయనకు అర్తత వస్త్రం అందించారు. గౌరవాధ్యక్షులుగా గణేష్, ఉపాధ్యక్షులుగా తిమ్మయ్య, అనుమేష్ కట్టిమనె, రామచంద్రప్ప, విరుపాక్షి, కార్యదర్శి రాజా, కోశాధికారి వెంకటేష్, సన్నరామయ్య, ఈశ్వరరావు, ఓంకారప్ప, దేవేంద్ర, నాగ, రవి, పదాధికారులుగా ఎన్నికయ్యారు.

కుమారస్వామి, సిటీ రవిని అరెస్టు చేయాలి

బళ్లారి సిటీ, జనవరి 31: మండ్య జిల్లాలోని కెరగోడు గ్రామం వద్ద హనుమాన్ జెండా వివాదానికి సంబంధించి ప్రజల ఆస్తులను నాశనం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని గురువారం కురుబ సంఘం డిమాండ్ చేసింది. నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్లో నిరసన తెలిపిన అనంతరం జిల్లాకలెక్టర్ సిబ్బంది ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు. మండ్యలో నిరసన చేస్తున్న సందర్భంలో కొంతమంది కురుబ సంఘం విద్యార్థి నిలయానికి రాళ్ళు వేసి సి.ఎం.సిద్దరామయ్య, అంబేద్కర్ బ్యానర్‌లను చింపి అవమానపరిచారని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవా లన్నారు. దీనికి కారణం జేడియస్ పార్టీ కుమారస్వామి, సి.టీ.రవి అని వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. నిరసనలో కురుబ సంఘం, వెనుకబడిన వర్గాలు పాల్గొన్నాయి.

అంగన్‌వాడీ కేంద్రంలో గోడలపై చిత్రాల ప్రదర్శన

తేరణగల్లు, జనవరి 31 : తేరణగల్లు స్టేషన్‌లోని గోర్పడి నగర్ వార్డు అంగన్ వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆడపిల్లల సమస్యలపై గోడలపై చిత్రాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ అధికారి లక్ష్మీ ప్రసన్న, ఆరోగ్య శిక్షణ అధికారి శివప్ప మాట్లాడుతూ ఆడపిల్లలు అభివృద్ధి సాధించాలని వారి సంతతిని పెంచాలని, భ్రూణలింగ పరీక్షలు అపరాధమని శిక్షలు తప్పవని పేర్కొన్నారు. అలాగే ఆడపిల్లల రక్షణపై విద్యార్థినిలు గోడలపై చిత్రాలను ప్రదర్శించారు. వారికి బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ముఖ్య శిక్షకులు మంగమ్మ, ఆరోగ్య శిక్షణ అధికారి శివప్ప, సమాలోచన అధికారి ప్రశాంత్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిజ్రాలకు వసతి కల్పించాలని ధర్నా



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిజ్రాలు

బళ్లారిరూరల్, జనవరి 31 : తమకు స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరుతూ బళ్లారి నగరంలో బుధవారం హిజ్రాలు ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు పర్వీన్‌బాను, ఉపాధ్యక్షులు గంగన్న, కార్యదర్శి చాందిని నేతృత్వంలో బళ్లారి బుడా ఆఫీసు సర్కిల్ నుంచి మోతీ సర్కిల్, రాయల్ సర్కిల్, కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు మనవి పత్రం అందించారు. ఈ ర్యాలీ సందర్భంగా కార్యదర్శి చాందిని మాట్లాడుతూ హిజ్రాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీలు ప్రవేశపెట్టగా తమకు ఎటువంటి పథకాలు అందడం లేదని వాపోయారు. తమకు కనీసం రూ. రెండు వేలు పింఛన్ లేదని, గతంలో హిజ్రాలకు హామీలిచ్చి అన్ని రకాల చేయూతనిస్తామని చెప్పి ఏడు నెలలైనా ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు.

జనజాగృతి ర్యాలీని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి

సిరుగుప్ప, జనవరి 31 : ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు రాజ్యాంగ అవగాహనపై జరిగే జనజాగృతి ర్యాలీని విజయవంతం చేద్దామని తాలుకా సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. సిరుగుప్ప పట్టణం సీడీపీవో భవనంలో ర్యాలీ కార్యక్రమం ఏర్పాట్లపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రచన వలన కొన్ని వర్గాలవారికి రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్యారెంటీ పథకాలను వివరించడం, రాజ్యాంగ రచన అవగాహనను సంపూర్ణంగా ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. వీటితో పాటు నృత్య ప్రదర్శన, కోలాటం, వివిధ వేషధారణలతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 3వ తేదీ తాకూరులో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆమె తెలిపారు. కావున ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దళిత నాయకులు కొడ్లి సదాశివ, వీరేష, బసప్ప, ముదినేడు వీరేష, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కంబళి మల్లికార్జున



బీజేపీ జెండాను పట్టుకుని పార్టీలో చేరుతున్న కంబళి మల్లికార్జున

సిరుగుప్ప, జనవరి 31 : శ్రీరామసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ బీజేపీ తాలుకా ప్రధాన కార్యదర్శి కంబళి మల్లికార్జున కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి మరల బీజేపీలో చేరారు. సిరుగుప్ప పట్టణ బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప సమక్షంలో బీజేపీలో చేరారు. సేవ చేసే వారికి కాంగ్రెస్ పార్టీలో స్థానం లేదని కంబ్లి మల్లికార్జున విమర్శించారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ దేశ శ్రేయస్సు కోసం ఎంతో కృషి చేస్తున్న నేపథ్యంలో బీజేపీ కోసం సేవచేయడం అత్యవసరమనే కారణంతో ఇందులో చేరినట్లు ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప కంబళి మల్లికార్జునను ఆహ్వానించి పూలమాల వేసి పార్టీ జెండాతో పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు దమ్మూరు సోమప్ప, వీరణ్ణ గౌడ, మైకెల్ వీరేష, మహాదేవ, చిరంజీవి రెడ్డి, మధుసూదనశెట్టి, కృష్ణ, పూజారి శ్రీనివాస, హెచ్‌ఎస్ నాగరాజ, లస్కర్ శేకప్ప, టీఎన్ కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



తేరణగల్లు, జనవరి 31 : తేరణగల్లు స్టేషన్ పరిధిలో శ్రీరామ్ సాయికుమార్ కనిపించడం లేదని ఆయన తండ్రి శ్రీరామ్ రామలింగేశ్వర్ ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరామ్ సాయి కుమార్ తేరణగల్లులోని జిందాల్ కంపెనీలో ఎస్‌ఎంఎస్ వన్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. జేఎస్‌డబ్ల్యూ టౌన్‌షిప్ బాయ్స్ హాస్టల్‌లో వుంటున్నాడు. జనవరి 23వ తేదీన ఏ షిఫ్ట్ పని ముగించుకుని అదే రోజు రాత్రి వాట్సాప్‌లో తండ్రికి 'నా కోసం వెతకొద్దు' అని మెసేజ్ పంపాడు. తాను టౌన్ షిప్ మొత్తం విచారించానని, లాభం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తండ్రి రామలింగేశ్వర్ తెలిపారు. అతని ఆచూకీ తెలిస్తే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.

హోసూరు జోన్

పక్షి జాతులపై వనకోటలో సమగ్ర సర్వే



సర్వేలో కనిపించిన వివిధ పక్షులు

హోసూరు (మత్తిగిరి) జనవరి 31: హోసూరు వనకోట కన్సర్వేటర్ కార్తీకేయని నేతృత్వంలో కెన్నెత్ అండర్సన్ నేచర్ సొసైటి సహకారంతో జనవరి 27, 28 తేదీలలో వివిధ పక్షి జాతులపై సర్వే చేశారు. హోసూరు రామనాయకన్ సరస్సు, తళి సరస్సు, అవలపల్లి ఆనకట్ట, అంచెట్టి సరస్సు, బారూర్ సరస్సు, కేఆర్‌పీ డ్యామ్ సహా మొత్తం 25 సరస్సులల్లో స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ సర్వే నిర్వహించారు. పక్షుల గణనలో 50 మందికి పైగా అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు. గతంలో పక్షులను గుర్తించడంలో అనుభవం ఉన్న సిబ్బంది, వలంటీర్లతో కలిసి, వివిధ జాతుల పక్షులను గుర్తించి రికార్డు చేశారు. సర్వేలో అటవీ ప్రాంతాల్లో గుడ్లగూబ, నల్ల గద్ద, అటవీ గుడ్ల గూబ, పిచుకురువి తదితర 200కుపైగా పక్షులను గుర్తించారు. ప్రత్యేకించి పసుపు ముక్కు ఉన్న పక్షులు టీవీఎస్ సముదాయం సరస్సు వద్దకు వచ్చి పొదిగి తన గుడ్లను సంరక్షిస్తుంటాయి. ఆ తర్వాత వలస ప్రారంభమవుతుంది. గత 20 ఏళ్లగా పసుపు ముక్కు ఉన్న పక్షులు నిత్యం వస్తూనే ఉన్నాయి. సర్వేలో పాల్గొన్న వారందరికీ అటవీశాఖ వారు ప్రశంసా పత్రాలు అందించారు.

భారీగా ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం

హోసూరు, జనవరి 31: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని పలుప్రాంతాల్లో కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై చర్యలు తీసుకుంటున్నారు. హోసూరు కమీషనర్ స్నేహా ఆదేశానుసారం నగర సంక్షేమ అధికారి ప్రభాకరన్ నేతృత్వంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, సూపర్ వైజర్ కృష్ణస్వామి, మారియప్పన్, వెంకటేశం, సిబ్బంది బృందం తనిఖీలు నిర్వహించారు. వ్యాపార లైసెన్స్ లేకుండా, కార్పొరేషన్ నుంచి నిషేధించబడిన ఒక కిలో ప్లాస్టిక్ కప్పులు, 10 కిలోల పేపర్ టీ కప్పులు స్వాధీనం చేసుకుని రూ.10వేల జరిమానా విధించారు. గాంధీరోడ్డు, మూకొండపల్లిలో నిర్వహిస్తున్న బట్టల దుకాణానికి సీల్ వేశారు. లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపినా పెద్దగా స్పందన లేకపోయిందని అధికారులు పేర్కొన్నారు.

గుట్కా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

హోసూరు(క్రైం), జనవరి 31: హోసూరు సమీపంలో జూజువాడి చెక్‌పోస్టు వద్ద సిప్‌కాట్ ఎస్‌ఎస్‌ఐ షణ్ముగం నేతృత్వంలో బుధవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. బెంగళూరు నుంచి హోసూరు వైపు వస్తున్న కారును పరిశీలించగా అందులో తమిళనాడులో నిషేధించిన గుట్కాను గుర్తించారు. 287 కిలోల గుట్కా విలువ రూ.2.25 లక్షలుగా అంచనా వేశారు. కారులో పట్టుబడిన అశోక్‌కుమార్ (32) రాజస్థాన్‌కు చెందినవాడని తెలిసింది. కాగా స్వాధీనం చేసుకున్న కారు విలువ రూ.5 లక్షలుగా తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కారు, గుట్కాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు.



కారు సహా గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

టిప్పుసుల్తాన్ నామఫలకానికి అవమానం

● సిరవార పట్టణంలో ఉద్రిక్తత ● శాంతింప జేసిన ఎమ్మెల్యే

రాయచూరు జనవరి 31 : టిప్పుసుల్తాన్ పేరుతో వెలసిన నామఫలకాన్ని కొంతమంది దుండగులు అవమానించారు. జిల్లాలోని సిరవార పట్టణం మటన్ మార్కెట్ సమీపంలో ఉన్న టిప్పుసుల్తాన్ నామఫలకానికి బుధవారం వేకువజామున కొంతమంది చెప్పులు వేలాడదీశారు. దీన్ని గమనించిన కొంతమంది యువకులు అందరికి సమాచారం ఇవ్వడంతో ఒక్కసారిగా అక్కడికి చేరుకున్న మైనార్టీ యువకులు ఆందోళనకు దిగారు. గంటసమయం గడిచేసరికి ఆ ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారడంతో తక్షణం పోలీసులు జోక్యం చేసుకున్నారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్, దుండగులను గుర్తించి తక్షణం వారికి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కాగా ఆందోళనకు దిగుతున్న యువకులను శాంతింప జేసిన ఎమ్మెల్యే నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమైతే ఆందోళనకు తానుకూడా అండగా నిలిస్తానని



టైర్‌లకు నిప్పంటించి నిరసనకు దిగిన యువకులు

వారిని శాంతింప చేశారు. కాగా అక్కడికి చేరుకున్న సీఐ, తహసీల్దార్‌లు 24 గంటల్లోగా నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని కేసులు నమోదు చేస్తామని ఆందోళనకారులకు హామీ ఇచ్చారు. దీంతో ఉద్రిక్తత సద్దు మణిగింది. ఇలాంటి వారి పట్ల పోలీసులు నిఘా వేసి ఉండాలని ఎమ్మెల్యే కోరారు.

ఫ్లెక్సీల ముద్రణలో నిబంధనలు పాటించాలి

రాయచూరు జనవరి 31 : వచ్చే లోకసభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ముద్రించే పోస్టర్‌లు, ఫ్లెక్సీలు ఇతరత్రా సామాగ్రిని ఎన్నికల నిబంధనలకు లోబడి ముద్రించాలని అదనపు జిల్లాధికారి దుర్గేష్ స్పష్టం చేశారు. రాజకీయ



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ దుర్గేష్

పార్టీలు, ముద్రణాలయాల యజమానులు, ఫ్లెక్సీల యజమానులతో ఆయన బుధవారం జిల్లాధికారి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏడీసీ దుర్గేష్ ముద్రించే ప్రతి కరపత్రం, పోస్టర్ లేదా ఫ్లెక్సీపై విధిగా ముద్రణాలయం పేరు వారి అడ్రస్ ఉండాల్సిందేనన్నారు. వ్యక్తిగత నిందలు, కుల,మతపరమైన విమర్శలు, కరపత్రాల్లోను ఇతరత్ర ముద్రణ పత్రికల్లోను ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో రాజకీయ పార్టీల నుంచి ముద్రణకు సంబంధించి వచ్చిన ఆర్డర్‌లకు సంబంధిత ఫారం ద్వారా అధికారుల నుంచి అనుమతి పొందాలన్నారు. అనుమతిపొందిన అనంతరమే ముద్రణ చేపట్టాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

క్లార్క్ గేబుల్ (జయంతి)



'ది కింగ్ ఆఫ్ హాలీవుడ్'గా పిలవబడిన విలియం క్లార్క్ గేబుల్ 1901 ఫిబ్రవరి 1న జన్మించారు. అమెరికాలో పేరొందిన నటుడు. 1924-26 మధ్య మూకీ సినిమాలతో వెండితెరపై ప్రవేశించారు. అనంతరం హీరో, విలన్ పాత్రలలో నటించారు. 37ఏళ్లలో 60కుపైగా సినిమాలలో నటించారు. అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌చే 'సెవెన్త్ గ్రేటెస్ట్ మేల్ స్టార్ ఆఫ్ క్లాజిక్ అమెరికన్ సినిమా'గా పేరొందారు. 1960 నవంబరు 16న గుండెపోటుతో కన్నుమూశారు.

ఎస్‌జే పెరెల్‌మన్ (జయంతి)



సిడ్నీ జోసెఫ్ పెరెల్‌మన్ 1904 ఫిబ్రవరి 1న న్యూయార్క్‌లో జన్మించారు. అమెరికాకు చెందిన హాస్యవేత్త, స్క్రీన్‌రైటర్. ప్రత్యేకించి చిన్నకథలు ఎంతో ఆదరణ పొందాయి. 1930, 40 దశకాలలో ది న్యూయార్కర్ సహా ఎన్నో మ్యాగజైన్‌లకు రచనలు అందించారు. నాటకాలకు, రచనలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 'అరౌండ్ ది వరల్డ్ ఇన్ 80 డేస్'కు అకాడమీ అవార్డు పొందారు. పలు రచనలు హాలీవుడ్ సహా ప్రపంచవ్యాప్తంగా పేరొందాయి. 1979 అక్టోబరు 17న కన్నుమూశారు.

అంజిరెడ్డి (జయంతి)



డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, 'పద్మభూషణ్' గ్రహీత కల్లం అంజిరెడ్డి 1939 ఫిబ్రవరి 1న గుంటూరు జిల్లా తాడేపల్లిలో జన్మించారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంతర్జాతీయ ఖ్యాతి పొందారు. ఫోర్బ్స్ సంస్థ విడుదల చేసిన దేశ వందమంది సంపన్నుల జాబితాలో 64వ స్థానం దక్కింది. 1984లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్థాపించిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ అంచెలంచెలుగా దేశంలోనే రెండో పెద్ద ఫార్మాగా ఎదిగింది. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన తొలి ఆసియా ఫార్మా కంపెనీ ఇదే. గ్రామీణ నిరుపేద యువకుల ఉపాధి శిక్షణకు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సర్ పీసీ రాయ్ అవార్డు, పద్మశ్రీ, హాల్ ఆఫ్ ఫేం తదితర అవార్డులు పొందారు. 2013 మార్చి 15న అనారోగ్యంతో కన్నుమూశారు.

కల్పనా చావ్లా (వర్ధంతి)



కల్పనా చావ్లా 1962 మార్చి 17న హర్యానా రాష్ట్రం కర్నాల్ పట్టణంలో జన్మించారు. వ్యోమగామి, ఇంజనీర్. అంతరిక్షంలో ప్రవేశించిన దేశ తొలి మహిళగా గుర్తింపు పొందారు. 1997 'స్పేస్ షటిల్ కొలంబియా' మిషన్‌లో రోబోటిక్ ఆర్మ్ ఆపరేటర్‌గా వ్యవహరించారు. 2003లో స్పేస్ షటిల్ కొలంబియా డిసాస్టర్‌లో పాల్గొని 2003 ఫిబ్రవరి 1న ప్రమాదవశాత్తు ఏడుగురు క్ర్యూ సభ్యులు సహా మృత్యువాతచెందారు. ఆమె జ్ఞాపకార్థం 'మెట్‌సాట్' మిటియరాలాజికల్ సిరీస్ ఆఫ్ శాటిలైట్‌కు కల్పనాగా అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ నామకరణం చేశారు.

బ్రహ్మానందం (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కన్నెగంటి బ్రహ్మానందం 1956 ఫిబ్రవరి 1న గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా) చాగంటి వారిపాలెం ప్రాంతంలో జన్మించారు. ప్రఖ్యాత తెలుగు హాస్య నటుడు. జంధ్యాల దర్శకత్వంలోని 'అహనా పెళ్ళంట' తొలి సినిమాతోనే గుర్తింపు పొందారు. వివిధ భాషలలో వెయ్యికిపైగా సినిమాలలో నటించి 2010లో గిన్నిస్ రికార్డుల్లోకి చేరారు. ఉత్తమ హాస్యనటుడిగా ఐదు నంది పురస్కారాలు, ఒక ఫిల్మ్‌ఫేర్, ఆరు 'సినీమా' అవార్డు, మూడు సైమా అవార్డులు అందుకున్నారు. 2005లో నాగార్జున విశ్వవిద్యాలయంనుంచి గౌరవ డాక్టరేట్, ఇంకా రాజీవ్‌గాంధీ సద్భావనా పురస్కారం ఇతరత్రా గౌరవాలు పొందారు.

ప్రియదర్శిని గోవింద్ (పుట్టినరోజు)



ప్రియదర్శిని గోవింద్ 1965 ఫిబ్రవరి 1న చెన్నైలో జన్మించారు. భరతనాట్యంలో పేరొందిన కళాకారిణి. నాట్యానికి సంప్రదాయంతోపాటు కొత్తదనంతో వన్నె తెచ్చారు. దేశంలోని ప్రముఖ ప్రాంతాలతోపాటు విదేశాల లోనూ నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. కేరళకు చెందిన మార్షల్ ఆర్ట్ కలరియపట్టులోనూ తర్ఫీదు పొందారు. నృత్య చూడామణి, వసంతలక్ష్మి నరసింహాచారి అవార్డు, సింగర్ మణి, కలైమామణి, యువ కళాభారతి అవార్డు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు పొందారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

చేళూరు, జనవరి 31: తాలూకాలోని చాకవేలు గ్రామపంచాయతీ కేంద్రంలో బీజేపీ చిక్కబళ్ళాపుర జిల్లా అధ్యక్షులుగా రామలింగప్ప రెండోసారి ఎంపిక కావడంపై బుధవారం పార్టీ కార్యకర్తలు ఆత్మీయంగా సన్మానం చేశారు. మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ ఆదినారాయణ రెడ్డి, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన విద్యావేత్త ఎంకే శ్రీధర్‌ను మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప ప్రత్యేకంగా సత్కరించారు.

జయదేవ డైరెక్టర్ మంజునాథ్‌కు వీడ్కోలు

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ సీఎన్ మంజునాథ్‌కు పూలవర్షం కురిపించి వీడ్కోలు పలికారు. 16 సంవత్సరాలుగా జయదేవ డైరెక్టర్ హోదాలో డాక్టర్ మంజునాథ్ సేవలందించారు. బుధవారంతో ఆయన పదవీకాలం ముగిసింది. మంగళవారం జయదేవ ఆసుపత్రిలో తోటి డాక్టర్లు, వందలాదిమంది సిబ్బంది వీడ్కోలు పలికారు. దేశంలోనే తొలిసారిగా ట్రీట్‌మెంట్ ఫస్ట్.. పేమెంట్ నెక్స్ట్ అనే నినాదంతో వైద్య సేవలు కొనసాగించారు. వేలాదిమంది గుండె ఆపరేషన్‌లను విజయవంతం చేశారు. వీడ్కోలు కార్యక్రమంలో మాజీ ప్రధాని దేవెగౌడ, ఆయన సతీమణి చెన్నమ్మ, డాక్టర్ మంజునాథ్ భార్య అనసూయ మంజునాథ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని దేవెగౌడ, డైరెక్టర్ హోదాలో మంజునాథ్ సాధనలపై ప్రత్యేకంగా రూపొందించిన క్యాలెండర్‌ను విడుదల చేశారు. అనంతరం దేవెగౌడ మాట్లాడుతూ జయదేవ సంస్థను డాక్టర్ చెన్నయ్య ప్రారంభించారని ఆయనకు మంజునాథ్ అంటే ఎంతో అభిమానం ఉండేదని గుర్తు చేసుకున్నారు. మంజునాథ్ విదేశాలకు వెళ్లే ఆలోచనలో ఉండగా అక్కడికెళితే సాధన ఉండదని, సామాన్య వర్గాలకు వైద్య సేవల ద్వారా రాణించాలని సూచించిన మేరకు ఇక్కడ చేరారన్నారు. మంజునాథ్ తన అల్లుడు అనేందుకు గర్వపడతానని పేర్కొన్నారు. 15 ఏళ్లపాటు కుమార్తె అనసూయ ఇంట్లోనే ఉన్నానని గుర్తు చేసుకున్నారు. పద్మశ్రీ పురస్కారం కంటే రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రత్యేక గౌరవం ఉందని, అది ఎన్నో రెట్లు అభిమానానికి నిదర్శనమన్నారు. డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ సాధన అనేది ఒకరితో సాధ్యం కాదని, ఎంతోమంది తనతో కలసి సేవలు చేశారని అదే జయదేవకు వచ్చిన మంచి పేరు అన్నారు. 1989లో జయదేవలో చేరినప్పుడు ఇక్కడ సౌలభ్యాలు పెంచాలని కలలు గన్నానన్నారు. ప్రస్తుతం రెండు వేల పడకల సామర్థ్యం కలిగి ఉందని, దేశంలో ఒక ఆసుపత్రికి ఇన్ని పడకలు ఉండడం ఎక్కడా లేదన్నారు. 2005లో ఇక్కడి నుంచి విరమించుకోవాలని భావించినా దేవెగౌడ అంగీకరించలేదన్నారు. 1994లో అమెరికాలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్‌ఓ) ఫెలోషిప్ చేసేందుకు వెళ్లినప్పుడు భిన్నమైన ఆలోచనలు వచ్చాయన్నారు. 16ఏళ్లలో జయదేవ 500 శాతం ప్రగతి సాధించిందన్నారు. ఓ మనిషి ఆరోగ్యం కాపాడితే ఓ కుటుంబాన్ని బతికించినట్టు అని అదే సిద్ధాంతంతో నిత్యం పని చేశానన్నారు. అనసూయ మంజునాథ్ మాట్లాడుతూ తాను అనేలా కాకుండా మేము అనేలా మంజునాథ్ పనిచేశారని, ఇంటినుంచి నవ్వుతూ ఎలా బయల్దేరేవారో వచ్చేటప్పుడు అలాగే సంతోషంగా ఉండేవారన్నారు. మంత్రి సుధాకర్ మాట్లాడుతూ డాక్టర్ మంజునాథ్ సేవలకు మెచ్చి అభిమానంతో ఇక్కడికి వచ్చానన్నారు. విక్టోరియా ఆసుపత్రి ప్రాంగణంలో జయదేవ ఓ శాఖగా ఉండేదని, ప్రస్తుతం జయదేవ అంటూనే బెంగళూరు, మైసూరు, హుబ్బళ్ళిశాఖల ద్వారా నిత్యం వేలాదిమంది పేదలకు ధైర్యం అనిపించేలా వైద్యం అందిస్తోందన్నారు. డాక్టర్లు, సిబ్బంది మంజునాథ్ దంపతులపై పూల వర్షం కురిపించారు. పలువురు సిబ్బంది కంటతడి పెట్టారు.



వీడ్కోలు సభలో డాక్టర్ మంజునాథ్, మాజీ ప్రధాని దేవెగౌడ తదితరులు

డాక్టర్ మంజునాథ్‌కు కర్ణాటక రత్నతో గౌరవించండి

జయదేవ ఆసుపత్రుల డైరెక్టర్‌గా సేవలందించి వేలాదిమంది ప్రజలు అభిమానించే డాక్టర్ మంజునాథ్‌కు కర్ణాటక రత్నతో గౌరవించాలని ప్రతిపక్షనేత అశోక్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా జయదేవలో సేవలు కొనసాగాయన్నారు. మంజునాథ్‌కు ఎటువంటి పురస్కారాలు ఇచ్చినా తక్కువేనని కర్ణాటక రత్నతో సముచిత స్థానం కల్పించాలన్నారు.

రాష్ట్రంలో మాన్యువల్ స్కావెంజర్లకు అవకాశం లేదు : సీఎం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సీఎం

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా మాన్యువల్ స్కావెంజర్‌లు ఉండరాదన్నది ప్రభుత్వ అభిమతమని ఇందుకు విరుద్ధంగా ఎక్కడైనా ఇలాంటి సామాజిక దురాగతాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి సిద్దరామయ్య హెచ్చరించారు. రాష్ట్రంలో గతంలో మాన్యువల్ స్కావెంజర్‌లుగా పనిచేసిన పలువురికి పునరావాసం, ఆర్థిక సాయం అందించేందుకు బెంగళూరులోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. సఫాయి కర్మచారి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, మహిళలకు ఆర్థికసాయం వంటివి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ సఫాయి కర్మచారిగా పనిచేసే సిబ్బంది జీతాన్ని రూ.7వేల నుంచి 17వేలకు పెంచామన్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు రూ.7.5 లక్షల సాయం అందిస్తున్నామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యేలు నరేంద్రస్వామి, బసంతప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 4వేలమంది సఫాయి కర్మచారులకు ఆర్థికసాయం అందించారు.

నిర్మాణ పనులను తనిఖీ చేసిన జిల్లా అధికారి

శిడ్లఘట్ట, జనవరి 31: శిడ్లఘట్ట పట్టణంలో నగరోత్థాన పథకం కింద జరుగుతున్న నిర్మాణాలను జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర పరిశీలించారు. బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ పాల్గొన్నారు. నగరోత్థాన పథకం కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి మొదటిదశలో రూ.30 కోట్లు, ఉద్యానవనాల నిర్మాణాలకు రూ.30కోట్లు విడుదల చేశారు. రైల్వేశాఖకు చెందిన సుమారు 8 ఎకరాల ప్రదేశంలో ఉద్యానవనం రూపొందించదలిచారు. ఇప్పటికే స్థల పరిశీలన చేసి రైల్వేశాఖకు నివేదిక పంపారు. కాగా అన్ని పన్ను వసూళ్లలో నగరసభ వెనుకబడిందని జిల్లా అధికారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓల్డ్ టౌన్, న్యూటౌన్ అని వేర్వేరుగా ఉండడంతో జాప్యమవుతోందని గుర్తించి ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి నగరసభకు సహకరించేలా తగిన జాగృతి కల్పించాలని అధికారులకు సూచించారు. నగరసభ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో నగరసభ సభ్యులు, అధికారులతో చర్చించి స్థానికులనుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బీఎన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జిల్లా అధికారి రవీంద్ర తదితరులు

నగరంలో నేటి నుంచి అఖిల భారతీయ కళాసాధక సంగమ

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సంస్కార భారతి ఆధ్వర్యంలో అఖిల భారతీయ కళాసాధక సంగమ 2024 నగరంలోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు జరుగనుంది. ఈ మేరకు సంస్థ నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మైసూరు యువరాజు యదువీర కృష్ణదత్త చామరాజ ఒడయార్ ముఖ్యఅతిథిగా హాజరుకానుండగా ప్రముఖ లోక కళాకారిణి పద్మశ్రీ మంజమ్మ జోగతి, యుకెలోని రాయల్ హిస్టారికల్ సొసైటీ సభ్యుడు డా.విక్రం సంపత్, ప్రఖ్యాత తబలా విద్వాంసుడు పండిట్ రవీంద్ర యావగల్, విజయనగర రాజవంశస్థుడు శ్రీకృష్ణదేవరాయ ప్రత్యేక అతిథులుగా హాజరు కానున్నారు. తొలి రోజైన గురువారం రాత్రి 7 గంటల నుంచి ఈశాన్య రాష్ట్రాల లోకనృత్యాలు ఉంటాయని ప్రకటన పేర్కొంది. ఫిబ్రవరి 2న కళలు, సాహిత్య రంగంలో సామాజిక సామరస్యం పాత్ర అనే అంశంపై ఉదయం 10 గంటల నుంచి చర్చాగోష్ఠి, సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కాగా ఫిబ్రవరి 2 నుంచి రెండు రోజుల పాటు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కళా ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 3న ఉదయం 10 గంటలకు భరతముని సమ్మాన్ కార్యక్రమం, సాయంత్రం 4 తర్వాత సాంస్కృతిక వేడుకలు ఉంటాయని ప్రకటన పేర్కొంది. ఫిబ్రవరి 2న సమరసతా యాత్ర ఉదయం 10 గంటలకు ప్రారంభంకానుందని, ఉదయం 11-30 గంటలకు ప్రారంభమయ్యే ముగింపు వేడుకలో ఆర్‌ఎస్‌ఎస్ సరసంఘచాలక్ మోహన్ భాగవత్, ఆర్ట్‌ఆఫ్ లివింగ్ సంస్థాపకుడు ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ గురూజీ పాల్గొంటారన్నారు. బెంగళూరు కనకపుర రోడ్డులోని ఉదయపుర వద్ద గల ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకలలో దేశవిదేశాల నుంచి ప్రతినిధులు పాల్గొననున్నారు.

ఆదర్శప్రాయుడు డాక్టర్ నరసింహయ్య

బాగేపల్లి, జనవరి 31: ప్రముఖ విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు పద్మభూషణ్ గ్రహీత డాక్టర్ హెచ్ నరసింహయ్య దూరదృష్టి, ఆదర్శాలు నేటి సమాజానికి మార్గదర్శకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆధునిక యుగంలో సాగుతున్న విద్యార్థులు శాస్త్రీయ మనోభావాలను అలవరుచుకుని ఎందుకు, ఎలా, ఏమిటి అనే ప్రశ్నలతో ముందుకెళ్లడం ద్వారా నరసింహయ్య సాధనలు శాశ్వతత్వం చేసేందుకు ప్రయత్నించాలన్నారు. పట్టణంలోని నేషనల్ కళాశాలలో బుధవారం ఏర్పాటైన డాక్టర్ హెచ్ నరసింహయ్య 19వ వర్ధంతిలో రామలింగప్ప పాల్గొన్నారు. తొలుత హెచ్‌ఎన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రామలింగప్ప మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ కోర్సులతోపాటు మెడికల్, ఇంటర్‌నెట్, ఎలక్ట్రానిక్ కోర్సులు ఆరంభించబడ్డాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమకు ఆసక్తి కల్గిన కోర్సులలో రాణించి చక్కటి పేరు తెచ్చుకోవాలన్నారు. నేషనల్ కాలేజ్ అధ్యక్షుడు నరసింహప్ప మాట్లాడుతూ కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యారంగానికి గొప్ప సేవలందించి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. పీయూ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటశివారెడ్డి, తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భూ అభివృద్ధి బ్యాంకు అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి, అప్పయ్య శ్రీనివాస్ బాబు, ఏకే నింగప్ప తదితరులు పాల్గొన్నారు.

'మాంగల్యభాగ్య'లో 13 జంటలు

దొడ్డబళ్ళాపుర, జనవరి 31: రాష్ట్ర ధర్మాదాయశాఖ పరిధిలోని తాలూకాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఘాటి సుబ్రమణ్య దేవస్థానంలో బుధవారం మాంగల్యభాగ్య పథకం కింద 13జంటలు దాంపత్యజీవనంలోకి అడుగుపెట్టాయి. ఉదయం 11.20 నుంచి 12.20 గంటలమధ్య అభిజిత్ లగ్నంలో ప్రముఖుల సమక్షంలో మాంగల్యధారణ జరిగింది. ప్రతి వరుడికి 5వేలు, వధువుకు రూ.10వేలు, బంగారం తాళి, రెండు బంగారు గుండ్లు సహా మొత్తం రూ.55వేలను ఆలయం తరపున అందజేశారు. నూతన వధూవరులను పలువురు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ పాలనాధికారి డీ నాగరాజ్, తహసీల్దార్ జేజే హేమావతి, నంజప్ప తదితరులు పాల్గొన్నారు.



వధూవరులతో నిర్వాహకులు, బంధుమిత్రులు

ఎమ్మెల్యేకు బోర్డు అధ్యక్ష పదవిపై హర్షం

బంగారపేట, జనవరి 31: నియోజకవర్గ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం నమోదు చేసిన ఎస్ఎన్ నారాయణస్వామికి కేబినెట్ హోదాకు సమానమైన రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలికి అధ్యక్షస్థానం దక్కడం కార్యకర్తలలో కొత్త ఉత్తేజం కల్పిస్తోందని గ్రామపంచాయతీ సభ్యుడు, జడ్పీ స్థానాన్ని ఆశిస్తున్న గోపాలరెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బస్టాండ్ సమీపాన బుధవారం అన్నదాసోహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే నారాయణస్వామి ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. ఆయనకు మంత్రిస్థానం దక్కుతుందని ఆశించామని అయితే కేబినెట్ హోదా కల్గిన మండలి అధ్యక్షస్థానం దక్కిందన్నారు. ఆయనకు మంత్రి పదవి దక్కి ఉంటే తాలూకాలోని 50చోట్ల అన్నదాసోహం నిర్వహించదలిచానని ప్రస్తుతం పట్టణంలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ సభ్యుడిగా ఎమ్మెల్యేగ్రాంట్లతో తనవంతు అభివృద్ధి పనులు చేశానన్నారు. కాగా ఎమ్మెల్యేకు రానున్న రోజుల్లో కేబినెట్‌లో చోటు దక్కుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, విజికుమార్, అనిల్, అరుణ్, ముత్తు, హరీశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవకుడు ఆటోరాజకు 10లక్షల సాయం

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రగతి, పేదవిద్యార్థుల కోసం ప్రత్యేకంగా సేవలందిస్తున్న ఎన్ఎఎంఐ సంస్థ ముఖ్యులు ఆటోరాజాకు బ్రిగేడ్ ఫౌండేషన్ పదిలక్షలు సాయం చేసింది. బ్రిగేడ్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్టు ముఖ్యులు గీతాశంకర్ ఎన్ఎఎంఐ సంస్థ ముఖ్యులు ఆటోరాజా అలియాస్ థామస్‌రాజాకు పదిలక్షల చెక్కుతో పాటు ప్రశంసాపత్రంతో సత్కరించారు. విద్యాసంస్థల ప్రగతి కోసం నిరంతరంగా సాయం చేసేందుకు కట్టుబడ్డామని గీతాశంకర్ ప్రకటించారు.



చెక్కు అందజేత

ఉత్సాహంగా యంగ్‌చెఫ్ ఒలింపియాడ్ పోటీలు

బొమ్మనహళ్ళి, జనవరి 31: కోరమంగలలోని ఐఐహెచ్‌ఎంలో యంగ్‌చెఫ్ ఒలింపియాడ్ తొలి విడత వంటల పోటీలు నిర్వహించారు. తొలివిడతలో పదిమంది పాల్గొనగా వివిధ దేశాలకు చెందిన చెఫ్‌లు కూడా పాల్గొన్నారు. ఫిబ్రవరి 4న ఫైనల్స్‌లో బహుమతుల ప్రదానం ఉంటుందని ఐఐహెచ్‌ఎం బెంగళూరు డైరెక్టర్ సంచరి చౌదరి తెలిపారు. 3.5 గంటలపాటు సాగిన పోటీల్లో నైపుణ్యం, శాకాహారంతో వంటల తయారీ, స్వీట్ల తయారీపై సాగింది. తొలి విడతలో ప్రొఫెసర్ డాటో అబ్దుల్ వహాబ్ యుమ్నాని, చెఫ్ షాన్ లియోనార్డ్, చెఫ్ ఎంజీ ఒలివేరి, చెఫ్ అనుపమ్ గులాటీలు పోటీలకు నేతృత్వం వహించారన్నారు. పాకశాస్త్ర పద్ధతుల జ్ఞానాన్ని పరిశీలించడమే పోటీల ఉద్దేశ్యమన్నారు.

సీఎంతో యుఏఈ విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి భేటీ

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ) విదేశీవ్యవహారాలు, అంతర్జాతీయ సహకార శాఖల మంత్రి అబ్దుల్ నసీర్ జమాల్ అల్ శాలి, ముఖ్యమంత్రి సిద్దరామయ్యను బుధవారం భేటీ అయ్యారు. బెంగళూరులోని తన అధికార నివాసానికి విచ్చేసిన యుఏఈ మంత్రికి సీఎం పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఉభయనేతలు రాష్ట్రంలో పెట్టుబడులు, పర్యాటక రంగం అభివృద్ధి ఇత్యాది అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, టీటీడీ బోర్డు సభ్యుడు కూడా అయిన ఆర్‌వీ దేశ్‌పాండే కూడా వెంట ఉన్నారు. భారత పర్యటనలో ఉన్న తాను మర్యాదపూర్వకంగానే సీఎం ను కలిశానని అనంతరం యుఏఈ మంత్రి అబ్దుల్ నసీర్ మీడియాకు చెప్పారు. రాష్ట్రంలో పలు రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

క్రెడెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే టీడీ రాజేగౌడ

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ (క్రెడెల్) అధ్యక్షునిగా నియమితులైన శృంగేరి ఎమ్మెల్యే టీడీ రాజేగౌడ బుధవారం విద్యుత్ శాఖా మంత్రి కేజే జార్జి సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజేగౌడను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పాదనను మరింతగా ప్రోత్సహించి ప్రస్తుతం నాల్గో స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా తీసుకెళ్ళేందుకు శక్తివంచన లేకుండా పాటుపడతానని రాజేగౌడ మీడియాకు చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక పదవిని అప్పగించినందుకు కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలకు, ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. క్రెడెల్ మేనేజింగ్ డైరెక్టర్ కేపీ రుద్రయ్య, మాజీ మంత్రి బీఎల్ శంకర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

డబ్బు తిరిగి ఇవ్వలేదని.. దంపతుల ఆత్మహత్య

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకున్నవారు వాపసు ఇవ్వకపోవడంపై మానసిక వేదనకు గురైన దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైసూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైసూరు శివారు ఆలనహళ్ళి ప్రాంతంలోని ఓ లాడ్జిలో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. విశ్వనాథ్ (30), భార్య సుస్మిత (25)లు మూడేళ్ళ కుమార్తెతో కలిసి ఈనెల 28న ఆదివారం లాడ్జికు వెళ్ళారు. ఒక రోజు గదిని అద్దెకు తీసుకున్నారు. అతర్వాత వీడియో ద్వారా అప్పు తీసుకున్న ముగ్గురు వాపసు చేయకుండా వేధిస్తున్నారని దీంతో జీర్ణించుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సదరు సందేశాన్ని రెండు వాట్సాప్ గ్రూపులకు పంపారు. కానీ గదిలో నుంచి వారు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది మంగళవారం ఆలనహళ్ళి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పరిశీలించగా దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన విషయం తేలింది. మృతుడు విశ్వనాథ్ సోదరుడు శ్యాంసుందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వాట్సాప్ గ్రూపులకు పంపిన సందేశాలను పరిశీలించి అప్పు చెల్లించాల్సిన వారు ఎవరనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీనియర్ సిటిజన్లను ఆదరించాలి

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్‌ల పట్ల సమాజంలో అందరికీ ఆదరణ ఉండాలని అతుల్య సీనియర్ కేర్ సెంటర్ ఆరంభంలో వైద్య విద్యాశాఖ మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్ అభిప్రాయపడ్డారు. వైట్‌ఫీల్డ్‌లో కేర్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్‌తోపాటు పలువురు ముఖ్యులు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో మార్పు వచ్చిందని, విద్య, ఉద్యోగాలు, వ్యాపారాల కోసం విదేశాలకు వెళ్లేవారు పెరిగారని తద్వారా వృద్ధాప్యంలో ఉన్నవారికి కనీస సేవలు కరువవుతున్నాయన్నారు. అతుల్య 9శాఖల ద్వారా సేవలందించడం అభినందనీయమన్నారు. అతుల్య మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కార్తీక్ ఆర్ నారాయణన్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్‌లు వృద్ధాప్యంలో ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు ఇతరత్రా పరిష్కారం కోసమే సంస్థ ఆరంభించామన్నారు. సీఈఓ శ్రీనివాసన్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నామన్నారు. ప్రత్యేక కేంద్రాలతోపాటు వారి ఇళ్లలోనూ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.



అతుల్యశాఖ ప్రారంభంలో మంత్రి

మార్కెట్‌లోకి 12 ప్రొ రియల్ మి మొబైల్

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మొబైల్‌రంగంలో బాగా డిమాండ్ కలిగిన రియల్‌మి 5జీ సిరీస్‌తో 12 ప్రో ఫోన్‌ను లాంఛనంగా మార్కెట్‌లోకి విడుదల చేసింది. బెంగళూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ ముఖ్యులు సౌరబ్ అరోరా, మార్కెటింగ్ డైరెక్టర్ సమీర్ సేట్‌లు ఆవిష్కరించారు. ఇదే సందర్భంగా రియల్‌మి మొబైల్స్‌లో ప్రతిసారి కొత్తదనం, సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వాచ్ ప్రేరిత ప్రదర్శనతో పాటు పెరి స్కోప్ టెలిఫోటో కెమెరా అనుబంధం చేశామన్నారు. ప్రీబుకింగ్ ఆన్‌లైన్ అందుబాటులో ఉందని 1000ల ఆఫర్ పొందవచ్చునని ఆన్‌లైన్ ద్వారా కూడా కొనుగోలు చేయవచ్చు అన్నారు. ఫిబ్రవరి 6నుంచి తొలి విక్రయం సాధ్యం చేశామన్నారు. రియల్‌మి స్టోర్‌లు, ఫ్లిప్‌కార్ట్ సహా ప్రముఖ షోరూంలలో అందుబాటులో ఉంటుందన్నారు. బ్యాంక్ ఆఫర్‌గా రెండువేల రాయితీ ఏడాది పాటు నోకాస్ట్ ఈఎంఐను పొందవచ్చు అన్నారు. రియల్ మి 12 ప్రొప్లస్ 5జి, రియల్ 12 ప్రొ 5జిలు మార్కెట్‌లోకి విడుదల చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ... డ్రైవర్ మృతి

ధర్మవరం రూరల్, జనవరి 31: కనగానపల్లి మండలం దాదులూరు కొట్టాల వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరుకు చెందిన రవిచంద్రన్(48) అనే డ్రైవర్ లారీతో బెంగళూరు నుంచి అనంతపురం వైపు వస్తున్నాడు. మార్గమధ్యలోని దాదులూరు కొట్టాల వద్దకు రాగానే జాతీయరహదారి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో లారీ గుంతలోకి దూసుకెళ్లింది. భయపడిన లారీ డ్రైవర్ కిందకు దూకాడు. తీవ్రగాయాలతో బయటపడ్డ అతన్ని స్థానికులు, హైవే సిబ్బంది సాయంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే రవిచంద్రన్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బెంగళూరులో 15 అడుగుల రాజీవ్‌గాంధీ విగ్రహం

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజధాని బెంగళూరులోని శేషాద్రిపురం సర్కిల్‌లో 15 అడుగుల ఎత్తైన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోనే ఇది అత్యంత ఎత్తయిన విగ్రహం కానుండం మరో విశేషం. బృహత్ బెంగళూరు మహానగర పాలికె నగరంలో 25 జంక్షన్లను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా శేషాద్రిపురం జంక్షన్‌ను కూడా 1.5 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేస్తున్నారు. కాగా బెంగళూరు నగర ఇన్‌చార్జిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన గ్రాంటు నుండి ఈ విగ్రహం ఏర్పాటు కోసం రూ 1.25 కోట్లను విడుదల చేశారు. 2,500 కిలోల బరువున్న రాజీవ్ గాంధీ కంచు విగ్రహాన్ని ప్రత్యేకంగా హైదరాబాదులో సిద్ధం చేయించారు. ఈ విగ్రహం పీఠం 5 అడుగులు, మెట్లు ఐదు అడుగుల కలిపితే మొత్తం ఎత్తు 25 అడుగులని బీబీఎంపీ అధికారి ఒకరు బుధవారం మీడియాకు చెప్పారు. ఈ విగ్రహ ప్రదేశంలో పలు సందేశాల బోర్డులను కూడా విద్యుద్దీపాలతో అలంకరించి ఏర్పాటు చేయనున్నారు. ఈ జంక్షన్ ఒక పర్యాటక కేంద్రంగా ఉంటుందని ఇక్కడ కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు బల్లలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విగ్రహాన్ని ఎప్పుడు? ఎవరు ప్రారంభిస్తారనే అంశంపై మాత్రం ఇంకా స్పష్టత లేదు.

క్రీడలతో మానసికోల్లాసం

పావగడ ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ, జనవరి 31: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని, అవి మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ పేర్కొన్నారు. తాలూకా పరిధిలోని దొడ్డహళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం షెటిల్‌కాక్, త్రోబాల్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద చిక్కహళ్లి పంచాయతీలోని పాఠశాల అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో నరేగా పనులను ఎంతో అందంగా తీర్చిదిద్దారని అయన ప్రశంసించారు. విద్యార్థులకు క్రీడలతో ఎంతో ఆనందం, ఉత్సాహం కలిగిస్తాయన్నారు. పాఠశాలలోని క్రీడామైదానాన్ని నరేగా పథకం కింద ఏర్పాటు చేసినందుకు అభినందనలు తెలియజేశారు. అనంతరం వరద ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓ జానకిరాం, తహసీల్దార్ వరదరాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.